# అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసిన యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

## నేడే బాబు జగ్జీవన్ రామ్ 118 జయంతి.


**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 04:**
భారతదేశంలో అణగారిన వర్గాల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహాయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్. ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయంగా నిలుస్తాయి అనడంలో అతిశయోక్తి కాదు. ఆనాటి చీకటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతూ కటిక పేదరికంలో నివసిస్తూ పీడిత దళిత దీన జనుల కోసం జీవితాంతం శ్రమించిన సంస్కరణల యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్. అందరితోనూ ఆప్యాయంగా బాబూజీ అని పిలిపించుకున్న బేబీ మినిస్టర్ గా కొనియాడబడిన,ఆయన నడిచిన బాట, అనుసరించిన ఆదర్శాలు, చూపిన సంస్కరణ మార్గాలను, గుర్తు చేసుకుంటూ ఆయన జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉన్నది.

ఒక సామాన్య రైతు కుటుంబంలో 1908 వ సంవత్సరంలో ఏప్రిల్ 5 వ తేదీన బాబు జగ్జీవన్ రామ్ జన్మించారు. ఆయన తండ్రి శోభిరామ్, తల్లి బసంతిదేవి. బీహార్ రాష్ట్రంలోని షాహాబాదు ప్రస్తుతము ఇప్పుడు బోజపూర్ జిల్లాలోని చాంద్వా అనే చిన్న గ్రామంలో ఆయన జన్మించారు. ఆయనకు అన్నయ్య సంతులాల్ తో పాటు ముగ్గురు అక్క చెల్లెలు ఉన్నారు. తండ్రి శోభిరామ్ మొదట బ్రిటిష్ సైన్యంలో నౌకరు పొందినప్పటికీ వలస పాలకుల విధానాలు నచ్చక ఉద్యోగానికి స్వస్తి పలికి తిరిగి తన సొంత గ్రామమైన చాంద్వా లో తమకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం పనులు చేస్తూ జీవనము కొనసాగించేవారు.

అంటరానితనానికి వ్యతిరేకంగా, సామాజిక సమానత్వానికి మద్దతుగా ఆయన ఎంతో కృషి చేస్తూ పోరాడారు. తాను చెప్పిన ఆదర్శాలను తు.చ, తప్పకుండా పాటిస్తూ బ్రిటిష్ వలస పాలన నుంచి దళిత సామాజిక వర్గాల విముక్తి కోసం శ్రమించారు, అతి ఎక్కువ కాలం చట్టసభ సభ్యులుగా అతి ఎక్కువ శాఖల బాధ్యతలు చేపట్టిన మంత్రిగా భారత దేశంలో అరుదైన రికార్డులు ఆయన సొంతం.118 డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతిని యావత్తు దేశం "సమతా దివస్" గా జరుపుకుంటుంది. ఆ మహనీయుని జయంతి సందర్భంగా ఘనమైన నివాళులు అర్పించాలి ఇది మన బాధ్యత మనం మరిచిపోతే చరిత్ర మనలను కూడా మర్చిపోతుంది.

### బాల్యం నుంచి బాబు జగ్జీవన్ రామ్ వివక్షలను ఎదిరించాడు

బాల్యం నుంచి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంటరానితనమును, వివక్షతలను ఎదిరించే తిరుగుబాటు తత్వం కలిగిన యోధుడు. విద్యార్థి దశలోనే గొప్ప నాయకుడిగా ఎదిగారు. అణగారిన సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని పనిముట్టుగా మలుచుకున్న ప్రజాయోధుడు, ప్రజానాయకుడు ఆయనే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్. వలసవాదం సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా భారతదేశంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమం, కుల నిర్మూలన కోసం జరిగిన సామాజిక సంస్కరణ ఉద్యమాలు కన్న ముద్దుబిడ్డ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భారతదేశ స్వరాజ్య ఉద్యమముతో తదనంతరం జరిగిన దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన బాబు జగ్జీవన్ రామ్ జీవితం రాజకీయ సామాజిక చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉంది. జగ్జీవన్ రామ్ ని స్మరించుకోవడం అంటే భారతదేశ స్వాతంత్రం సామాజిక ఉద్యమాల చరిత్ర ఈ నేలపై ఉప్పొంగిన ఘట్టాలను గుర్తు చేసుకోవడమే. సామాజిక సంస్కరణ ఉద్యమాలలో బాబు జగ్జీవన్ రామ్ విశిష్టమైన గొప్ప స్థానాన్ని



పదులపరుచుకున్నాడు కులరహిత సమాజం కోసం తన జీవితాంతం పోరాడిన ధీరుడు.అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేశారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తన చిన్నతనం నుంచి తనకు ఎదురైన అంటరానితనం, వివక్ష సామాజిక అసమానతలపై నిరసన గలాన్ని వినిపిస్తూ వచ్చారు. సామాజిక న్యాయం కోసం నిరంతరం ఎన్నో పోరాటాలు చేశారు అణగారిన వర్గాలలో సమానత్వాన్ని ప్రోత్సహించాలనే ఆయన తపనకు ఆజ్యం పోశాయి. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులాలను ఏకీకృతం చేయడానికి కలకత్తా విశ్వవిద్యాలయంలో అసమానతలు, సామాజిక వివక్షలను,ఎదుర్కొన్నారు.

సమాజంలో వివక్షకు గురై సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలైన దళిత గిరిజనుల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిన చైతన్య దీప్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అయితే ఆయన రాజ్యాంగంలో దళితులకు కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు తన జీవితాంతం పోరాడిన దళిత జనోద్ధారకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్.

### స్వాతంత్య్ర పోరాటంలో బాబు జగ్జీవన్ రావు పాత్ర

1936 వ సంవత్సరంలో బీహార్ శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికై 28 సంవత్సరాల వయస్సులో బాబు జగ్జీవన్ రామ్ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1937 వ సంవత్సరంలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ నుంచి 14 రిజర్వుడు అభ్యర్థులను పోటీకి నిలిపారు. ఆ ఎన్నికల్లో ఎలాంటి పోటీ లేకుండా 14 మంది అభ్యర్థులు గెలవడంతో జగ్జీవన్ రామ్ ఒక రాజకీయ నిర్ణయాత్మకశక్తిగా. కింగ్ మేకర్ గా ఎదిగారు. ఈ సమయంలోనే తమతో చేతులు కలపాల్సిందిగా "కాంగ్రెస్ పార్టీ" నుంచి జగ్జీవన్ రామ్ గారికి ఆహ్వానం అందింది. 1942 వ సంవత్సరంలో ఆయన బొంబాయిలోని అగ్రనేతల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పుడే కాంగ్రెస్ పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసింది. "స్వాతంత్ర్యమో లేక మరణమో" "సాధించు లేదా మరణించు" అనే నినాదాలు దేశమంతటా వ్యాపించాయి. ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ ను కూడా ఆసమయంలో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని పాట్నాలోని స్వగృహంలో జగ్జీవన్ రామ్ అరెస్టయ్యారు. 1943 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం అధినేతల్ని ఖండిస్తూ దేశ స్వాతంత్ర్య సాధన కోసం అనేక సభలు, సమావేశాలు, పెద్ద ర్యాలీలు నిర్వహించారు. 1946 వ సంవత్సరములో ఆగస్టు 30 న భారతదేశంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా బ్రిటిష్ వైస్రాయ్ ఆహ్వానించిన 12 మంది దేశ నాయకులలో బాబు జగ్జీవన్ రామ్ ఒకరు కావడం విశేషం. 1946 వ సంవత్సరంలో సెప్టెంబరు 2 ఏర్పాటుచేసిన మధ్యంతర ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా, అణగారిన సామాజిక వర్గాలకు ఏకైక ప్రతినిధిగా ఆయన నిలిచారు. మంత్రిమండలిలో అతి పిన్న వస్కుడైన బాబు జగ్జీవన్ రామ్ గారిని అందరూ "బేబీ మినిస్టర్" అని పిలిచేవారు. 40 సంవత్సరాలు పైబడి సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా దేశ ఉప ప్రధానిగా సీనియర్ పార్లమెంటేరియన్ గా పనిచేసిన ఆయన తన తుది శ్వాస వరకు దళిత హక్కుల పరిరక్షణ ధ్యేయంగా పనిచేశారు. కేంద్ర కార్మిక మంత్రిగా కార్మికుల సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ మంత్రిగా ఉన్న కాలంలో హరిత విప్లవం సాధించడంలో కీలకపాత్ర పోషించి రైతు పక్షపాతిగా నిలిచారు.కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు దేశాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. కేంద్ర ఆహార శాఖ మంత్రిగా ఆయన దేశంలోని ఆహార సమస్యల పరిష్కారం కోసం హరిత విప్లవానికి నాంది పలికారు.

### గాంధీ మార్గంలో బాబు జగ్జీవన్ రామ్

జాతిపిత మహాత్మా గాంధీ అభిప్రాయాలతో బాబు జగ్జీవన్ రామ్ ఆయనను అనుసరిస్తూ ఏకీభవించేవారు. దేశ స్వాతంత్ర్యం పోరాటంలోనూ ముందున్నారు. సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలతో గాంధీజీ వెంట నడిచారు. సామాజిక న్యాయం సాధించాలంటే ముందుగా దేశంలో కుల వివక్షకు అడ్డుకట్ట వేయాలని ఆయన నమ్మేవారు. దళితులకు తగినంత రాజకీయ ప్రాతినిధ్యం సాధించినట్లయితే సమాజంలో అణగారిన వర్గాలకు గుర్తింపు దక్కుతుందని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. అలాగే దళితులకు ఓటు కోసం కూడా గొంతెత్తారు. ఆదర్శప్రాయమన్న ప్రజా జీవితాన్ని కొనసాగించారు అలాగే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో జగ్జీవన్ రామ్ ఉత్సాహంగా పాల్గొనేవారు. సామాజిక సమానత్వం పై అందర్నీ చైతన్యపరిచేందుకు సంఘాలను నిర్మాణాత్మక స్థాపించడం జరిగింది.

### ఎస్సీ ఎస్టీల అభివృద్ధి కోసం కృషిచేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

1934 వ సంవత్సరంలో జగ్జీవన్ రామ్ కలకత్తాలో అఖిల భారతీయ రవిదాస్ మహాసభను స్థాపించారు. దళితుల సాంస్కృతిక "కుల గురు"అయినా గురు సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అనేక జిల్లాలలో రవిదాసు సమ్మేళనాలు చేపట్టినారు. సాంఘిక సంస్కరణ కోసం వ్యవసాయ కార్మిక మహాసభను, ఆల్ ఇండియా డిప్రెసెడ్ క్లాసెస్ లీగ్ మొదలైన సంఘాలను నెలకొల్పినారు. ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూ మరోవైపు సాంఘిక సంస్కరణల కోసం రాజకీయ ప్రాతినిధ్యం వహించిన గొప్ప మేధావి జగ్జీవన్ రామ్ బీహార్ లో 1934 వ సంవత్సరంలో వచ్చిన భయంకర భూకంపం సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ ప్రజలకు సహాయ పునర్వాస కార్యక్రమాలు చేపట్టారు, ఈ సందర్భంలోమొదటిసారిగా గాంధీజీ గారితో పరిచయం ఏర్పడింది. 1935 వ సంవత్సరంలో కాన్పూర్ లో జరిగిన డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ సమావేశమునకు బాబు జగ్జీవన్ రామ్ అధ్యక్షత వహించారు. ఆరు సంవత్సరాలు పాటు అధ్యక్షుడిగా వ్యవహరించి దేశంలోని షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల హక్కులు అభివృద్ధి కోసం ఆయన తీవ్రంగా కృషి చేశారు. అదేవిధంగా 1969 వ సంవత్సరములో అధికార కాంగ్రెస్ పార్టీకి జగ్జీవన్ రామ్ అధ్యక్షుడు అయ్యాడు. 1975 వ సంవత్సరంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించినప్పుడు ఆమె నియంతృత్వ విధానాలతో విభేదించి, కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు ప్రకటించి బయటకు వచ్చిన ఆయన 'ప్రజాస్వామ్యం కాంగ్రెస్' (కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ) అనే పార్టీని స్థాపించారు. తర్వాత దాన్ని జనతా పార్టీలో విలీనం చేశారు. 1977 వ సంవత్సరంలో జనతా ప్రభుత్వం ఏర్పడినప్పుడు దేశ ప్రధాని పదవికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎంపిక దాదాపుగా ఖరారు. అయినప్పటికీ కొందరు దళిత వ్యతిరేకులు అడ్డుకోవడంతో దేశ తొలి దళిత ప్రధాని అయ్యే అవకాశం ఆయన కోల్పోయారు. కానీ మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో 1977 వ సంవత్సరంలో జగ్జీవన్ రామ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా విధులు నిర్వహించారు. 1979 వ సంవత్సరం జనవరి 24 తేదీన ఉప ప్రధానమంత్రిగా జగ్జీవన్ రామ్ బాధ్యతలు స్వీకరించారు. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేయడంలో కూడా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారు 1950 వ సంవత్సరంలో సికింద్రాబాద్ కర్బలా మైదానంలో జరిగిన గొప్ప బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. 1976 వ సంవత్సరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ హరిజన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగ్జీవన్ రామ్ గొప్ప దార్శనికథ గొప్ప అనుభవం ఉన్న రచయిత ఆయన హిందీ ఇంగ్లీష్ భాషలలో రచనలు చేశారు. "భారతదేశంలో కులం సవాళ్లు" "జీవన సరళి వ్యక్తిత్వ వికాసం"అనే
రెండు పుస్తకాలు రచించారు ఆయన గొప్ప సేవలకు గాను ఉజ్జయినిలోని విక్రమ విశ్వవిద్యాలయం 1967 వ సంవత్సరంలో జగ్జీవన్ రామ్ గారికి "డాక్టర్ ఆఫ్ సైన్స్"అనే



గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. 1968 వ సంవత్సరంలో కాన్పూర్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. మూఢనమ్మకాలు సామాజిక వివక్ష, అసమానతలు లేని స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య సోషలిస్ట్ సమాజ నిర్మాణం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దార్శనికత లో రూపుదుద్దుకున్నదే1986 వ సంవత్సరంలో జూలై 6 వ తేదీన బాబూజీ భౌతికంగా మనల్ని వీడారు యావత్తు భారత జాతి ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. ఈదేశము ఎప్పటికీ గుర్తుంచుకోగల నాయకుడు రాజకీయ బానిసత్వం పై నిరంతరం యుద్ధం చేసిన వీరుడు. ఆయన ఆశయ సాధనకు దళితులు అందరూ ఏకమై పని చేయాలి. పాలక పార్టీల చేతులలో పావులుగా మారకుండా ఓటు బ్యాంకుగా రాజకీయ పార్టీలకు ఉపయోగపడకుండా రాజ్యాధికార సాధన కోసం పని చేస్తారని ఆశిద్దాం దళితులు రాజ్యాధికారం కోసం పోరాడటమే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కి నిజమైన నివాళులు అర్పించిన వారం అవుతాం



డా.జి.బాలస్వామి.
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు
వ్యవస్థాపక అధ్యక్షుడు
పూలే అంబేడ్కర్ జ్ఞాన కేంద్రం